## అధ్యాయము 16

# హాగరు మరియు ఇష్మాయేలు యొక్క కథనము

చాలా ముందుగా ఆదికాండము 11:30లోనే శారా గొడ్రాలని రచయిత బయలుపరచాడు; కాని దేవుడు అబ్రాహామునకు ఇచ్చిన ప్రధానమైన ఆశీర్వాదములలో ఒకటి తన సంతానము “గొప్ప జనము”గా ఉంటుందని (12:2). పితరుడు అనేకమంది సంతానమును కలిగియుంటాడు మరియు వారు కనాను దేశమును దైవిక బహుమానముగా పొందుకుంటారు అని దేవుడు పదేపదే చెప్పాడు (12:7; 13:15, 16; 15:4–7).

దత్తతు తీసుకోబడిన వారసుని వాగ్దాన పుత్రునిగా పరిగణించుటకు దేవుడు ఒప్పుకొనలేదు (15:2–4a). వాగ్దాన దేశమును గూర్చి చెప్పబడిన వారసుడు పితరుని “గర్భవాసము” (15:4b, 5, 13–18) నుండి వస్తాడని ఉద్ఘాటిస్తూ దేవుడు అబ్రాహాముతో ఒక గొప్ప నిబంధన చేశాడు. దేవుడు తన వాగ్దానమును నెరవేర్చుటకుగాను శారా సహాయము చేయుటకు ప్రయత్నించింది, కాని తన ప్రణాళికకు చేదు ఫలితాలు చూసింది.

### అబ్రాహాము కుటుంబములో కలహము (16:1–6)

**[1]అబ్రాము భార్యయైన శారయి అతనికి పిల్లలు కనలేదు. ఆమెకు హాగరు అను ఐగుప్తీయురాలైన దాసి యుండెను. [2]కాగా శారయి–ఇదిగో నేను పిల్లలు కనకుండ యెహోవా చేసి యున్నాడు. నీవు దయచేసి నా దాసితో పొమ్ము; ఒకవేళ ఆమెవలన నాకు సంతానము కలుగవచ్చునని అబ్రాముతో చెప్పెను; అబ్రాము శారయి మాట వినెను. [3]కాబట్టి అబ్రాము కనాను దేశములో పదియేండ్లు కాపురమున్న తరువాత అబ్రాము భార్యయైన శారయి తన దాసియైన హాగరను ఐగుప్తీయురాలిని తీసికొని తన పెనిమిటియైన అబ్రామునకు భార్యగా ఉండునట్లు అతనికిచ్చెను. [4]అతడు హాగరుతో పోయినప్పుడు అది గర్భవతి ఆయెను. అది**

**తాను గర్భవతి నైతినని తెలిసికొనినప్పుడు దాని యజమానురాలు దానిదృష్టికి**
**నీచమైనదాయెను. 5అప్పుడు శారయి–నా ఉసురు నీకు తగులును; నేనే నా దాసిని**
**నీ కౌగిటికిచ్చిన తరువాత తాను గర్భవతినైతినని తెలిసికొనినప్పుడు నేను**
**దానిదృష్టికి నీచమైనదాననైతిని; నాకును నీకును యెహోవా న్యాయము**
**తీర్చునుగాక అని అబ్రాముతో అనెను. 6అందుకు అబ్రాము–ఇదిగో నీ దాసి నీ చేతిలో**
**ఉన్నది; నీ మనస్సు వచ్చినట్లు దాని చేయుమని శారయితో చెప్పెను. శారయి దాని**
**శ్రమ పెట్టినందున ఆమె యొద్దనుండి అది పారిపోగా.**

**వచనము 1**. తనకు ఇయ్యబడిన దైవిక వాగ్దానమును అబ్రాహాము స్పష్టంగా తన భార్యతో కూడా పంచుకున్నాడు; కాని, సమయము గడచినకొలదీ, ఆమె తన **భర్తకొరకు పిల్లలు కనలేదు**. ఆమె ఇంకెప్పుడైనా పిల్లలను కనగలదు అనే విషయం చాలా కష్టతరముగా ఉంది, ఎందుకంటే ఆమె అప్పటికే కనీసం డెబ్బది యైదేండ్ల యీడు గలది.[1] అట్టి పెద్ద వయసులో ఋతువిరతి అప్పటికే ప్రారంభమైయుంటుంది, కాబట్టి గర్భధారణకు సంబంధించి అన్ని సహజ ఆశలు అడియాసలు అయ్యి ఉంటాయి.

బైబిల్ రచయిత **శారయిని** అబ్రాహామునకు **భార్యగా** (אִשָּׁה, *'ishshah*) చెప్పాడు, ఇది పాత నిబంధనలో "స్త్రీ" లేదా "భార్య" అను పదమునకు సామాన్య పదము. దేవుడు ఆదామునకు హవ్వను ఇచ్చినప్పుడు ఈ అర్థంలోనే ఆదాము మొట్టమొదటిగా ఈ పదమును ప్రయోగించాడు (2:23). దీనికి విరుద్ధంగా, **హాగరు** అనే ఒక **ఐగుప్తీయురాలైన స్త్రీ శారయికి** దాసిగా (שִׁפְחָה, *shipchah*) చెప్పబడింది. పాతనిబంధనలో ఈ పదము సాధారణంగా వివాహితులైన స్త్రీల యొక్క "పేచియున్న దాసీలు"గా[2] ఉండే ఆడ బానిసలను గూర్చి ప్రయోగించబడేది. ఫరో అబ్రాహామునకు ఐగుప్తులో ఇచ్చిన "దాసీలలో" ఈమె ఒకటై ఉండవచ్చు (12:16), కాబట్టి ఇప్పుడు ఆమె శారాకు వ్యక్తిగత దాసిగా శారా ఆధీనంలో ఉంది.

**వచనము 2**. తన మీద ఒత్తిడి పెరిగిన కొలదీ, సంతానమును ఉత్పన్నం చేయుటకుగల తన అసమర్థత యొక్క నిందను **యెహోవా** మీదికి శారా వేస్తూ అంటుంది, ఇదిగో **పిల్లలు కనకుండ యెహోవా** [ఆమెను] చేసి యున్నాడు అని. ఈ అవగాహనలో ఆమెది తప్పో ఒప్పో అని తెలుసుకొనుటకు మనకు ఎట్టి మార్గము లేదు. ఈ రోజుల్లో కొన్ని మానసిక మరియు/లేదా భౌతిక కారణములు స్త్రీలలో గర్భధారణ సమస్యలను పెంచుతున్నాయని మనకు తెలుసుకదా. ఎట్లైనను, ఆదికాండములో దేవుడు కొంతమంది స్త్రీల గర్భములను మూసేసిన కొన్ని అసాధారణ సందర్భాలు జరిగాయి; అట్టి పరిస్థితుల్లో దైవిక జోక్యం లేకుండా గర్భధారణ అసాధ్యమైంది (20:17, 18; 29:31; 30:22 చూడండి). వారి పరిస్థితుల యొక్క వివరములు ఏమైనప్పటికి కూడా, ఎన్నుకొనబడిన ఈ దంపతులకు శారా యొక్క మూయబడిన గర్భము అనునది విశ్వాస పరీక్షగా

ఉంది.

శారా తన జీవితపు ఈ దశలో తనకంటూ సొంత బిడ్డను పొందలేకపోవుట వలన నిరాశ చెందిన కారణాన, అబ్రాహామును తన **దాసితో పొమ్ము** అని పలికి ఇంకా అంటుంది, **ఒకవేళ ఆమెవలన నాకు సంతానము కలుగవచ్చును** అని. ఈనాడు ఈ వాక్యము మనకు చాలా వింతగా అనిపిస్తుంది; కాని ఒక కుటుంబ వారసత్వమును కొనసాగించుటకు మగబిడ్డ అవసరతను బట్టి మరియు ప్రాచీన కాలములలో గొడ్రాలైన భార్యపై పడే అవమానమును బట్టి, తనకు వేరే మార్గము ఏమి లేదని శారా అనుకొని ఉండవచ్చు.

గర్భం ధరించగలను అనే శారా నిరీక్షణ ఆవిరైపోయింది, మరియు ఆమె సహనము విసుపోయింది. అబ్రాహాము తనకు కుమారులు లేకుండా దేవుడు చేసిన వాగ్దానము ప్రకారముగా ఒకదినమున వాగ్దాన దేశమును స్వతంత్రించుకొను గొప్ప జనసమూహమునకు ఏ విధంగా తండ్రి కాగలడు? ప్రాచీన పశ్చిమ ఆసియాలో, బహుళ పత్నీ వ్రతమునకు ఇచ్చే మామూలు కారణములు భార్య యొక్క గొడ్రాలు తనమైనా ఉండవచ్చు లేదా ఆ భార్య మగ సంతానమును కనకపోవడమైనా ఉండవచ్చు. అట్టి సందర్భాలలో, రెండవ భార్యను తీసుకొనుటకు భర్తకు అధికారము ఉంది; కాని భర్త అతి సాధారణంగా ఒక బానిస ద్వారా గాని లేదా హాగరు వంటి ఒక దాసి పిల్లద్వారా గాని కుమారుని కనడం ఆనవాయితి.

అబ్రాహాము మరియు శారా జన్మించి కనాను దేశమునకు ఒక పది సంవత్సరముల క్రితం రావడానికి మునుపు కాపురమున్న ప్రాచీన మెసొపొతమియలోని చట్ట స్మృతులు అట్టి కొన్ని నిబంధనలను కలిగియున్నాయి. ఉదాహరణకు, క్రీ.పూ. పదిహేనవ శతాబ్దమునకు చెందిన నూజి గ్రంథములలో ఒకటి చెప్తుంది, పేరుగాంచిన కుటుంబమునకు చెందిన ఒక భార్య ఒకవేళ పిల్లలను కనలేక ఉంటే తన భర్త కొరకు తన స్థానంలో ఆయనకు పిల్లలను కనుటకు లుల్లు (అంటే ఇక్కడ శ్రేష్టమైన బానిస బాలికలు ఉంటారు) నుండి ఒక ఉపపత్నిని తీసుకుని రావచ్చు అని. అట్టి సంబంధం వలన పుట్టిన బిడ్డ తన సొంత బిడ్డగా పరిగణించబడతాడు మరియు తమ సొంత వైవాహిక సంబంధం నుండి పుట్టిన బిడ్డ వలెనే చట్టబద్ధమైన అన్ని హక్కులు కలిగి ఉంటాడు.[3]

శారా బహుశా చిక్కుకొనిపోయాను అనుకొని ఉంటుంది. తనతో సమానముగా చట్టబద్ధమైన హక్కులు కలిగి ఉన్న మరొక ప్రత్యర్థి భార్య ఉండటం ఆమెకు ఇష్టం లేదు. కాబట్టి శారా ఆలోచనలో ఎక్కువ ఇబ్బంది లేని అవకాశమేమంటే తన దాసిని వాగ్దాన పుత్రునికి ఒక సర్రోగేట్ తల్లిగా (అద్దె తల్లిగా, లేదా గర్భస్థ శిశువును పెంచుట కొరకు ఉపయోగించే ఇంకొక స్త్రీ) ఉండుటకు అబ్రాహామును బ్రతిమాలుకోవడం.

ఇక్కడ ప్రయోగించబడిన భాష చెప్పుకోదగినది, ఎందుకంటే తన భార్య సలహాకు పితరుడు ఇచ్చిన దారి మళ్లించు జవాబు ఏదేను తోటలో హవ్వ యొక్క

ప్రతిపాదనకు ఆదాము తల ఒగ్గినప్పుడు ప్రయోగించిన పదజాల క్రమముతో (3:17) పోల్చి చూడబడింది.[4] ఇక్కడ వచనము చెప్తుంది **అబ్రాము శారయి మాట వినెను** అని, ఇది హెబ్రీ విధానంలో ఆయన ఆమె యొక్క సలహాను అనుసరించాడు అని చెప్పడం. ఒక విధంగా, అబ్రాహాము "మానవుని పతనము"ను అభినయించాడు. దేవునిపై ఆధారపడి తన మాటను అనుసరించవలసినది పోయి, హృదయమును చించే ఫలితములతో తన భార్య మాటను విని తన ఉపదేశమునుబట్టి చేశాడు.

**వచనము 3.** వాగ్దాన దేశములో ఒక దశాబ్దము గడిపి ఇంకను ఒక కుమారుని కూడా పొందుకోలేక శారా తన **దాసియైన హాగరను ఐగుప్తీయురాలిని అబ్రాముకు భార్యగా ఇచ్చుటకు** నిశ్చయించుకుంది. దాసియైన (*shipchah*) హాగరు అబ్రాహామునకు భార్య (*'ishshah*) అయినప్పటికీ, ఆమె రెండో భార్యనే; ఆమెకు కొన్ని చట్టబద్ధ హక్కులు ఉండగా, శారాతో సమాన హక్కులు ఆమెకు లేవు. శారా తన భర్తకు ఇచ్చిన ఒక బహుమానం ఆమె, మరియు అబ్రాహాము ఆ బహుమానమును పొందుకొనిన వాడు; ఉంపుడుగత్తె అయ్యే విషయంలో హాగరుకు ఎటువంటి అవకాశము కూడా లేదు.

పాత నిబంధనలో ఇతర చోట్ల, "ఉంపుడుగత్తె" (פִּלֶגֶשׁ, *pilegesh*) మరియు "భార్య" (אִשָּׁה, *'ishshah*) అనే ఈ రెండు పదములు ఎప్పుడు ఒకదానితో ఒకటి వ్యత్యాసపరచబడ్డాయి. అయినను, ఆదికాండపు రచయిత ఈ రెండు పదములను ఒకే స్త్రీలను గూర్చి ప్రయోగించాడు: హాగరు(16:3; 25:6), కెతూరా (25:1, 6), మరియు బిల్హా (30:4; 35:22). ఈ సమాచారమును ఆధారము చేసికొని, పితరుల కాలములో ఈ పదములు పర్యాయపదములుగా ప్రయోగించబడ్డాయి మరియు ఉపపత్నులను గూర్చి మాట్లాడుటకు వీలుగా ఏ ఒక్క పదము కూడా పరిగణలో లేదు అని Victor P. Hamilton ఆలోచించాడు.[5]

**వచనము 4.** శారా విన్నపము ప్రకారము చేసిన అబ్రాహాము **హాగరుతో పోయెను** – అంటే, ఆమెతో సంభోగంలో పాలు పొందాడు. ఇక్కడ వాక్య భాగము వేరేగా చెప్పుటలేదు గనుక, ఈ అన్యోన్యం కేవలం ఒక్క సారికే పరిమితమయ్యి ఉంటుంది. అబ్రాహాము మరియు ఆ దాసి శారా యొక్క పనిముట్టులుగా పనిచేసారు మాత్రమే; **హాగరు గర్భము ధరించినప్పుడు** ఆమె యొక్క ఆలోచన సఫలీకృతమౌతుందని శారా తలంచినది. అయినను, ఆ విజయము శారాకు ఆనందాన్ని కలిగించలేకపోయింది. ఈ చిన్న స్త్రీ తను గర్భము ధరించినది అని తెలిసికొన్నప్పుడు దాని యజమానురాలు దాని **దృష్టికి నీచమైనదాయెను** (NRSVలో అయితే "ధిక్కారముతో చూసింది" అని ఉంది). ఈ విషయము శారా విషయములో తీవ్రమైన అసూయను కలిగించింది, ఇకను ఆమె హాగరును ఒక హానిగా భావించడం ప్రారంభించింది. దేవుని చిత్తములో బహుళత్వ పత్నీవ్రతము ఎందుకు లేదో అనేదానికి ఇది ఒక కారణము. ఆదిలో దేవుడు ఆదామునకు

కేవలం ఒక భార్యనే సృష్టించాడు (2:24). ప్రత్యర్థిత్వం, పగ, మరియు అనిశ్చితి ఖచ్చితంగా బహుళత్వ వివాహ బంధాలలో జరుగుతాయి (29:30, 31; 30:8; 35:22), మరియు ఈ వినాశనాత్మక పగ అబ్రాహాము యొక్క కుటుంబములో బయలుపడింది.

**వచనము 5**. హాగరు తన పట్ల అహంకార భావంతో ఉన్నప్పుడు శారా స్పందిస్తూ అబ్రాహాముతో అంటుంది, **నా ఉసురు నీకు తగులును** అని. మరొకసారి తను ఈ చొరవను తీసుకుంది, విచారమును బట్టి అబ్రాహామును నిందించింది గాని తన ఉపాయము యొక్క స్పష్ట ఫలితమే కదా ఇది.[6] ఆమె కోపములో తన ఇబ్బందులను తన భర్తకు అంటుపెట్టడమే కాకుండా, హాగరు యొక్క అహంకార ధిక్కారమును "నా ఉసురు"గా పరిగణించింది. "ఉసురు" అనే స్థానంలో అనువదించబడిన హెబ్రీ పదము חָמָס (*chamas*). జలప్రళయమును రప్పించిన పాపములను గూర్చి మాట్లాడే క్రమంలో, ఇదే పదమును "బలత్కారము" అని 6:11, 13లో అనువదించారు. 49:5లో యాకోబు తన కుమారులు షెకెమువారిని చంపారని చెప్తున్నప్పుడు కూడా ఇదే పదమును ప్రయోగించాడు (34:25 చూడండి). తన యజమానురాలిపై హాగరు బలాత్కారమును ప్రయోగించింది అని ఈ వాక్యము చెప్పుటలేదు గాని, శారా తన దాసి ప్రవర్తనను హింసాత్మకముగా మరియు ద్వేషపూరితంగా వివరించి, ఆమెపై నేరారోపణను చేసింది.

శారా పట్ల హాగరు యొక్క ధిక్కారము తన యజమానురాలితో సమానంగా తనను పరిగణించుకుంటుందని తెలుపుతుంది, ఎందుకంటే తన యజమానునికి శారా ఇవ్వలేని ఒక వారసుని ఇవ్వగలిగింది గనుక. ఇదే నిజమైతే, హాగరు నిజముగా చాలా దూరం ఆలోచించింది. ప్రాచీన చట్ట స్మృతులు ఉంపుడుగత్తె యొక్క ఇట్టి సమాధానముల నుండి మొదటి భార్యను కాపాడేవిగా ఉన్నాయి. హమ్మురబి అనే ఒక స్మృతి తన దాసి ద్వారా బిడ్డలను పొందుకొనుటకు తన భర్తకు దాసిని ఇచ్చిన ఒక ప్రాధమిక భార్యను గూర్చి మాట్లాడుతుంది. అది అంటుంది "ఒకవేళ తరువాత కాలంలో ఆ దాసి బిడ్డలను కన్నందున తన యజమానురాలితో సమానతను కోరినట్లయితే, తన యజమానురాలు ఆమెను అమ్మకూడదు; ఆమెను ఒక బానిసత్వపు మచ్చతో గురుతుపెట్టి బానిసలలో ఆమెను లెక్కించాలి."[7] సామెతలు 30:23లో ఈ లోకము భరించలేని నాలుగు ప్రవర్తనలు ప్రస్తావించబడ్డాయి, వాటిలో ఒకటి "యజమానురాలికి హక్కుదారులైన దాసి."

**నాకును నీకును యెహోవా న్యాయము తీర్చునుగాక** అని తన గౌరవం కొరకు శారా ఉన్నత న్యాయస్థానమును ఆశ్రయించింది. దైవిక న్యాయమునకు తన భర్త స్పందించి తన దాసి కంటే కూడా సరియైన స్థానమునకు ఆమెను ఉంచులాగున, తద్వారా తన దాసియొక్క అహంకారమును అణచులాగున, దేవుని పేరిట పిలుస్తున్నట్లుగా ఆమె కనిపిస్తుంది. తనకును మరియు అబ్రాహాముకును మధ్య

కూడా న్యాయము తీర్చమని దేవుని వేడుకున్నట్లుగా కూడా ఈ ఫిర్యాదు ఉంది.

**వచనము 6**. తన మాజీ యజమానురాలి పట్ల హాగరు ఆధిపత్య వైఖరిని వెల్లబుచ్చినప్పుడు ఆమెపై అబ్రాహాముకు గల చట్టబద్ధ అధికారాన్ని విడిచిపెట్టి శారాతో ఇలా అన్నాడు, **ఇదిగో నీ దాసి నీ చేతిలో ఉన్నది; నీ మనస్సు వచ్చినట్లు** [טוֹב, *tob*] **దాని చేయుము** అని. తన భార్యకు ఇట్టి మృదువైన సమాధానమును ఇచ్చుట ద్వారా శారా నిజముగా హాగరు విషయములో అంత కఠినముగా ప్రవర్తించక, తన పట్ల కరుణ చూపి సరియైన పద్ధతిలో ఆమెను చూస్తుందని అబ్రాహాము భావించి ఉంటాడు. అయినప్పటికీ, అది కేవలం ఒక తప్పుడు ఆశే అయింది; బదులుగా, శారా దాని శ్రమ పెట్టెను. హాగరును తను ఇబ్బంది పెట్టినప్పుడు వాడిన ప్రధానమైన పదము עָנָה (*'anah*) నకు అర్థము "బలవంతము చేయు" లేదా "శిక్షించులేదా బాధ కలుగజేయు."[8] ఇశ్రాయేలీయులు ఐగుప్తు దేశములో బానిసలుగా ఉండగా ఐగుప్తువారు ఇశ్రాయేలీయులకు చేసిన దానికి కూడా ఇదే పదము ప్రయోగించబడింది (నిర్గమ. 1:11, 12). శ్రమ అను పదమునకు గల ఖచ్చితమైన రూపము తెలియనిదిగా ఉంది, కాని శారా హాగరును ఎంతగా బాధించింది అంటే ఆమె యొద్దనుండి అది తన సొంత ఇల్లు అయిన ఐగుప్తీ ప్రాంతములో అరణ్యమునకు పారిపోవునంతగా బాధించింది (16:1, 7).

## ఇష్మాయేలు యొక్క జననము (16:7–16)

**7యెహోవా దూత అరణ్యములో నీటిబుగ్గయొద్ద, అనగా షూరు మార్గములో
బుగ్గ యొద్ద, ఆమెను కనుగొని 8శారయి దాసిపైన హాగరూ, ఎక్కడనుండి వచ్చితివి,
ఎక్కడికి వెళ్లుచున్నావని అడిగినందుకు అది–నా యజమానురాలైన
శారయియొద్దనుండి పారిపోవుచున్నాననెను. 9అప్పుడు యెహోవా దూత– నీ
యజమానురాలియొద్దకు తిరిగి వెళ్లి ఆమె చేతి క్రింద అణిగియుండుమని దానితో
చెప్పెను. 10మరియు యెహోవా దూత–నీ సంతానమును నిశ్చయముగా
విస్తరింపజేసెదను; అది లెక్కింప వీలులేనంతగా విస్తారమవునని దానితో చెప్పెను.
11మరియు యెహోవా దూత – ఇదిగో యెహోవా నీ మొరను వినెను. నీవు
గర్భవతివై యున్నావు; నీవు కుమారుని కని అతనికి ఇష్మాయేలు అను పేరు
పెట్టుదువు; 12అతడు అడవిగాడిదవంటి మనుష్యుడు. అతని చెయ్యి అందరికిని
అందరి చేతులు అతనికిని విరోధముగా ఉండును. అతడు తన సహోదరులందరి
ఎదుట నివసించునని దానితో చెప్పగా 13అది–చూచుచున్న దేవుడవు నీవే అను
పేరు తనతో మాటలాడిన యెహోవాకు పెట్టెను ఏలయనగా నన్ను చూచినవాని
నేనిక్కడ చూచితిని గదా అనుకొనెను. 14అందుచేత ఆ నీటిబుగ్గకు బెయేర్
లహాయిరోయి అను పేరు పెట్టబడెను. అది కాదేషుకును బెరెదుకును**

**మధ్యనున్నది. [15]తరువాత హాగరు అబ్రామునకు కుమారుని కనెను. అబ్రాము హాగరు కనిన తన కుమారునికి ఇష్మాయేలను పేరు పెట్టెను. [16]హాగరు అబ్రామునకు ఇష్మాయేలును కనినప్పుడు అబ్రాము ఎనుబదియారు ఏండ్లవాడు.**

**వచనము 7.** శారా ఉగ్రత నుండి హాగరు పారిపోతుండగా, **యెహోవా దూత అరణ్యములో నీటిబుగ్గయొద్ద, ఆమెను కనుగొని** అని ఇక్కడ కథనము చెప్తుంది. "యెహోవా దూత" అనే పదసమూహము పాత నిబంధనలో ఏబది ఎనిమిది సార్లు ప్రయోగించబడింది. కొన్ని సార్లు ఇది దేవుని వ్యక్తిగత రాయబారిగా (ప్రతినిధిగా) భూమిమీదికి పంపబడిన పరలోక జీవిని సూచిస్తుంది. ప్రాచీన పశ్చిమ ఆసియాలో రాజదూతను రాజునకు బహు సమీపస్తునిగా పరిగణించేవారు. ఇక్కడ యెహోవా "దూత" (מַלְאָךְ, *mal'ak*, "messenger") లేఖనములలో సాధారణముగా దేవునికి ప్రాతినిధ్యం వహించే, దేవుని కొరకు మాట్లాడే, మరియు దేవుని మహిమలో కొంతభాగాన్ని ప్రతిబింబించే మనిషిగా కనబడతాడు.

ఎట్లైనను, బైబిల్ కథనములలో "యెహోవా దూత" తరచుగా దేవుని వలె మాట్లాడేవారు మరియు దేవుని వలె అగుపడేవారు. అట్టి ఒక రూపమును చూచినవారు తాము దేవుని చూచారని ఆశ్చర్యపడేవారు.[9] కాగా యెహోవా దూత అనునది దేవుని యొక్క కనిపించే ప్రత్యక్షత—ఒక థియోఫని. కొన్నిసార్లు ఈ ప్రత్యక్షత మానవ రూపమును తీసుకొనేది, మరి కొన్నిసార్లు ప్రజలు దేవుడే స్వయంగా అన్నట్లు భావించే మహిమాయుక్తమైన మరియు కోపోద్రిక్తమైన రూపమును చూసేవారు.

యెహోవా దూత హాగరును అరణ్యములో అనగా షూరు మార్గములో బుగ్గ యొద్ద కనుగొనబడినప్పుడు ఆమె ప్రత్యేకంగా ఆశీర్వదించబడిన వ్యక్తి. "షూరు" (שׁוּר, *Shur*) అనగా "గోడ" (49:22; యోబు 24:11), మరియు బహుశా ఇది ఆసియా వారు ఐగుప్తును దండెత్తకుండా ఉండుటకు తూర్పు భాగమున నిర్మించిన ప్రాకారపు వరుసను (25:18; 1 సమూ. 15:7) సూచిస్తుంది. ఒంటరిగా సీనాయి అరణ్యము మీదుగా పారిపోవుటకు హాగరు ప్రయత్నించడం తెలివితక్కువతనం, ఎందుకంటే కనాను మరియు ఐగుప్తు మధ్యనున్న దరిదాపుగా ఒక వంద మైళ్ల ప్రయాణము మేర నీరుగాని ఆహారముగాని చాలా కొదువ మరియు బహుశా అసలు లేవు.

**వచనము 8.** యెహోవా దూత **హాగరును** కలిసినప్పుడు ఆమె **శారాయి దాసియని** ఆమెకు ముందే తెలుసు; మరియు ఆమె పారిపోవుటకు గల కారణములు కూడా తెలుసు. కాబట్టి, ఈ ద్వంద్వ ప్రశ్నలు **ఎక్కడనుండి వచ్చితివి, ఎక్కడికి వెళ్లుచున్నావు?** అనేవి చమత్కారంగా ఉన్నాయి. అబ్రాహాము కుటుంబమును విడచుటకు ఆమె తీసుకున్న నిర్ణయం యొక్క పర్యావసానాలను పునారాలోచించవలసినదిగా ఈ ప్రశ్నలు అడగబడ్డాయి. **నా యజమానురాలైన**

**శారయియొద్దనుండి పారిపోవుచున్నాను** అని హాగరు వాస్తవంగానే బదులిచ్చింది.

**వచనము 9**. అందుకు ఆ **దూత**, **నీ యజమానురాలియొద్దకు తిరిగి వెళ్లి ఆమె చేతిక్రింద అణిగియుండుము** అని ఆమెతో చెప్పింది. హాగరుకు తన్నుతాను తగ్గించుకొని శారాకు అణిగియుండటం చాలా కష్టతరంగా ఉంటుంది, కాని ఆ నిర్మానుష్య అరణ్యములో తనకొరకు కాచుకునియున్న తప్పనిసరి మరణముకంటే ఇదే ఆమెకు ఉత్తమము.

**వచనము 10**. **దూత** హాగరుతో **యెహోవా ఆమె యొక్క సంతానమును నిశ్చయముగా విస్తరింపజేసి వారిని కూడా లెక్కింప వీలులేనంతగా** చేసి ఆమెను ఆశీర్వదిస్తాడని చెప్పింది. దేవుడు అబ్రాహామునకు కూడా ఇట్టి వాగ్దానమే చేసియుండగా (13:16; 15:5), ఆదికాండములో దేవుడు ఇట్టి వాగ్దానమును నేరుగా చేసిన స్త్రీలలో హాగరు ఒక్కతే ఉంది. ప్రాచీన కాలములలో శిశుజననముల వద్ద జరిగే అధిక సంఖ్యక గర్భస్రావముల మరియు మరణముల నేపథ్యంలో, ఆమెకు ఆరోగ్యవంతమైన బిడ్డ కలిగి లెక్కకు వీలులేనంత మంది సంతానము కలుగుతారని చెప్పిన ఈ దైవిక వాగ్దానము ఆమె ఆత్మను ఉత్తేజపరచి కనాను దేశమునకు తిరిగివెళ్లుటకు **నిశ్చయతను కలిగించింది**.

**వచనము 11**. **దూత** హాగరు గర్భవతియని తనకు తెలుసునని తెలుపుతూ ఆమెతో మరలా మాట్లాడింది. అప్పుడు ఆమె ఒక కుమారుని కనును అని ఆమెతో చెప్పింది. హగరు అరణ్యములో చూసిన ఈ రహస్య వ్యక్తి ఎదో వేడిమిగల సూర్యకాంతికి అధికంగా లోనగుటవలన తాను చూసిన ఒక భ్రమ కాదని ఈ పదములు ఆమెకు రుజువుచేసాయి. ఇది దేవుని యొక్క ప్రత్యక్షత అయి ఉండాలి అని ఆమెకు తెలుసు, ఎందుకంటే దేవునికి మాత్రమే తనకు పుట్టబోయే బిడ్డ యొక్క లింగము తెలుస్తుంది. ఆఖరుకు, అబ్రాహామునకు వాగ్దానము చేయబడిన వారసుడు ఆయన ఎనుబదియారేండ్ల యీడుగలవాడైనప్పుడు దయచేయబడినట్లుగా అనిపించింది (16:16); మరియు సర్రోగేట్ తల్లిగా (అద్దె తల్లిగా) తన పాత్ర తప్పక ఫలిస్తుందని హాగరు భావించింది.

దీనికి తోడు ఆ దూత ఆ పుట్టబోయే బిడ్డ యొక్క పేరు **ఇష్మాయేలుగా** బయలుపరచింది. దీనికి ఒక కారణమును కూడా ఇచ్చింది: **ఇదిగో యెహోవా నీ మొరను వినెను** అని. "ఇష్మాయేలు" (יִשְׁמָעֵאל, *Yishm'ae'l*) అను పేరునకు అర్థము "దేవుడు వింటాడు" లేదా "దేవుడు విన్నాడు" అని. ఇది హెబ్రీ పదచాతుర్యములో ఒక సాధారణ విధానం, ఇక్కడ దేవుడు హాగరు యొక్క వేదనకు చెవియొగ్గాడు అని తెలుపుతుంది, అంటే తన యజమానురాలైన శారా పెట్టే బాధను.

**వచనము 12**. హాగరుకు తెలుపబడిన బిడ్డ యొక్క గుణము, ప్రవర్తన, మరియు గమనము ఏ తల్లియైనా తన బిడ్డలను గూర్చి ఆలోచించే విధానమునకు చాలా వ్యత్యాసముగా ఉంది. దూత ప్రకారముగా, **ఈ బిడ్డ అడవిగాడిదవంటి**

**మనుష్యుడు, అతని చెయ్యి [బహుశా] అందరికిని అందరి చేతులు [బహుశా] అతనికిని విరోధముగా ఉండును**. “అడవి గాడిద” అను అర్థమునిచ్చు పదము פֶּרֶא (*pere'*) (యోబు 2:24; హోషెయా 8:9) ఇష్మాయేలు విషయములో అలంకారప్రాయంగా ప్రయోగించబడింది; ఆయన అరణ్యములో నివసించే “స్వతంత్ర సంచారకుడు”[10] గా ఉంటాడు. ఇక్కడ గుర్తించబడిన జీవి గాడిద కంటే కూడా ఒక గుఱ్ఱంగా గుర్తించబడింది, కాని అది సాధుపరచబడుటకు ఒగ్గదు (యిర్మీయా 39:5–8). ఈ విధంగానే ఇష్మాయేలు కూడా అడవి మనిషిగా ఉండి, నాగరికతను మరియు సాంఘిక సంప్రదాయాలను విస్మరిస్తాడు. ఆయన అహంకార ధిక్కార ప్రవర్తన కలిగి సమాజంలో సర్దుకుపోవడానికి నిరాకరిస్తాడు. ప్రతి ఒక్కరి శత్రువుగా జీవిస్తాడు, సర్దుకుపోవడానికి నిరాకరిస్తాడు; మరియు అందరు కూడా ఆయనను ఆ విధంగానే పరిగణిస్తారు.

ఈ కారణము చేత ఇష్మాయేలు **తన సహోదరులందరి ఎదుట నివసించునని, కనాను దేశమునకు తూర్పున** ఉన్న దేశములో, గొప్ప అరేబియా ఎడారికి అంచులలో ఉండునని చెప్పబడింది. ఈ ప్రవచనము మెసొపొతమియ నుండి ఐగుప్తు గొప్ప అరణ్యముల మీదుగా కొని కొన్ని సార్లు మానవ బానిసలను ఎగుమతి చేస్తూ ప్రయాణములు సాగించిన ఇష్మాయేలు బిడారులకు కూడా వర్తిస్తుంది (37:25–28; 39:1). పలు బెయోడియన్ గుంపులతో కలసి ఇతర ఇష్మాయేలీయులు కనానులో ఉన్న స్థిర నివాసుల మీద దండెత్తి వారిని కొల్లగొట్టుకున్నారు (న్యాయాధి. 7:12; 8:24). అయినను, ఈ హెబ్రీ వాక్యమును వేరుగా కూడా అనువదించవచ్చు. “తూర్పు దిక్కున” అనే భావము עַל־פְּנֵי (*'al pᵉney*) నుండి వచ్చినది, అంటే అక్షరాలా “ముఖమునకు ముందుగా.” అతడు తన “సహోదరుల పట్ల శత్రుత్వ భావముతో జీవించాడు” (ఉద్ఘాటన జోడించబడినది) అని NIV ఇక్కడ చెప్తుంది. 16:12 యొక్క మునుపటి భాగముతో ఈ అనువాదము ఏకీభవిస్తుంది. ఇంకా, 25:18లో ఈ ప్రవచనము యొక్క నెరవేర్పును NASB “తన సహోదరులందరి యెదుటధిక్కారముతో స్థిరపడ్డాడు” (ఉద్ఘాటన జోడించబడినది)[11] అని అనువదిస్తుంది.

**వచనము 13**. దైవికమైన ఎదుర్పాటు ద్వారా హాగరు యెహోవాను వినేవాడిగా (16:11) అలాగే **చూచుచున్న** వాడిగా గుర్తించింది; ఆయన ఆమె యొక్క శ్రమను మరియు వేదనను విన్నాడు మరియు చూశాడు. అబ్రాహాము “యెహోవా”ను గూర్చి దేవునిగా చెప్పడం ఆమె వినియుంటుంది; మరియు ఆ దూత అదే పదమును (יהוה, “the Lord”; 16:11) మరలా వాడినప్పుడు, హాగరు చూచుచున్న దేవుడవు నీవే అను పేరు తనతో మాటలాడిన యెహోవాకు పెట్టెను. ఆమె అంటుంది, “నీవు చూచుచున్న దేవుడవు” అని. ఇక్కడ ఉన్న హెబ్రీ వాక్యము అర్థం చేసుకొనుటకు కష్టము అయినను, తన తరువాతి వాక్యము, NIV చెప్తున్నట్లుగా, ఆమె దేవుని చూచానని గుర్తించిందని మాత్రమే చెప్పడం లేదు.

"నన్ను చూచినవాని నేనిక్కడ చూచితిని గదా?"అని ఆశ్చర్యంలో ఆమె అడుగుతుంది.[12] ఎవరైతే దేవుని ఎదుర్కొన్నారో లేదా తన దైవిక ప్రాతినిధ్యాన్ని చూసారో చనిపోతారని భయపడిపోయేవారు; దేవుని పరిశుద్ధత ముందు వారు తమ పాప భావమును గుర్తించారు (32:30; న్యాయాధి. 6:22, 23; 13:22; యెష. 6:5; నిర్గమ. 33:20 చూడండి).

**వచనము 14**. ఆ తరువాత రచయిత ఆ **బావి** యొక్క పేరును **బెయేర్ లహాయిరోయి**, అంటే **కాదేషుకును మరియు బెరెదుకును** మధ్యనున్నదిగా బయలుపరచాడు. ఈ పేరునకు అర్థము "నన్ను చూచుచున్న జీవముగల (వాని) యొక్క బావి"[13] ఇటువంటిది అయియుంటుంది. "కాదేషు" అనునది నెగెవు (దక్షిణ కనాను) మరియు సీను అరణ్యము (సంఖ్యా. 13:21, 26 చూడండి) మధ్యనున్న సరిహద్దులో ఉంది, కాని "బెయేర్ లహాయిరోయి" మరియు "బెరెదు"ల ఖచ్చితమైన స్థలము అనిశ్చితములు. బెయేర్ లహాయిరోయి అనునది ఇస్సాకు కొంతకాలం జీవించిన (24:62; 25:11) నెగెవు ప్రాంతమందున్న నీరుగల ప్రదేశము.

**వచనము 15**. హాగరు అరణ్యములోని అనుభవము తరువాత–ఇందులో శారా వద్దకు ఆమె తిరిగి వెళ్లవలసినదిగా, కుమారుని గూర్చి మరియు అనేకమంది సంతానమును గూర్చి హాగరు దూతద్వారా హెచ్చరిక చేయబడింది –అబ్రాహాము యొక్క ఐగుప్తీయురాలిన ఉపపత్ని– భార్య తన కుటుంబమునకు తిరిగి వచ్చింది. అబ్రాహామునకు దూత ఇచ్చిన సందేశమును గూర్చి (16:11) ఆమెకు అంతగా సందేహములు లేవు, ఎందుకంటే **అబ్రాము హాగరు కనిన తన కుమారునికి ఇష్మాయేలను** పేరు పెట్టెను. ఆ బిడ్డకు పేరు పెట్టుట ద్వారా, అబ్రాహాము తనను తన కుమారునిగా మరియు చట్టబద్ధమైన వారసునిగా అంగీకరించాడు.[14]

**వచనము 16**. అబ్రాహాము శారా ద్వారా తరువాత కాలంలో కుమారుని ఒకవేళ కంటే బానిస స్త్రీ యొక్క కుమారుడు తన తండ్రికి చెందిన సమస్తమును వారసత్వముగా పొందుటకు మొదటి వరుసలో ఉండడు, కాని అట్టి ఒక సంఘటన మానవీయంగా సాధ్యపడకుండా కనబడుతుంది. **హాగరుకు ఇష్మాయేలు జన్మించినప్పుడు అబ్రాహాము ఎనుబది యారేండ్ల** యీడుగలవాడు, మరియు శారా డెబ్బది యారేండ్ల యీడుగలది.

## అన్వయము

### ప్రక్కదోవ పట్టినప్పుడు (అధ్యాయము 16)

చాలా మందికి సుదూరం ప్రయాణము చేసిన తరువాత ఉన్నట్లుండి "దారి మళ్ళించబడినది" అని తెలుపే మార్గదర్శిలను చూచిన అనుభవం ఉండి ఉండవచ్చు. ఇది సాధారణంగా అంతగా బాగోలేని వేరొక దారిలోనికి

మళ్ళించబడినదని తెలుపుతుంది, అయినను దారి మళ్ళించబడుటను గూర్చిన చిహ్నము చేరవలసిన గమ్యమునకు చేరుటకుగాను ఇంకొక దారి ఉందని తెలుపుతుంది కూడాను. గరుగ్గా ఉన్న దారిపై కొన్ని మైళ్లు ప్రయాణము చేసిన పిమ్మట మళ్ళించబడిన ఆ కారులోని ప్రయాణికులు అట్టి మార్గదర్శులను ప్రశ్నించడం మొదలు పెడతారు. వారు దారి తప్పారని అనుకోవచ్చు మరియు వారి ఇబ్బందిని బట్టి కొందరిని నిందించవచ్చు. ఇలా సుదూర ప్రక్కదోవను అనుసరించడం అనునది సహనమును చాలా పరీక్షించే అనుభవము కావచ్చు.

ఆదికాండము 16వ అధ్యాయములో అబ్రాహాము, శారా మరియు హాగరు ముగ్గురు తమ జీవితములలో ప్రక్కదోవ తీసుకుని, మొదటిలో తమకు సరియైనదిగా తోచిన తప్పుదారిలో ప్రయాణించారు. వారి సమస్యకు అది పరిష్కారమును అందించడానికి బదులు దేవుని వాగ్దానమును నెరవేర్చుటకు గాను శారా తీసుకున్న ప్రత్యమ్నాయ మార్గము ఇంకా అధిక సమస్యలను సృష్టించి వారి కుటుంబములో కొన్ని వివాదాలను తెచ్చింది. అక్కడ ఉన్నవారికి అందరికి ఇది మిక్కిలి విపత్తును కలిగించి ఉంటుంది. ఈ బైబిల్ ఉదంతంలో, మానవ ఆలోచనను నమ్మడం వలన కలిగే అపాయములు స్పష్టమౌతున్నాయి; ఈ జీవనశైలి ఈ పితరుల కుటుంబమునకు ముందు దేవుడు ఉంచిన విశ్వాస నడకకు పూర్తి వ్యతిరేకంగా ఉంది.విశ్వాసము ద్వారా నడచుటవలన కలిగే సవాళ్లను ఎదుర్కొనుటకు దేవుడు నేటికి కూడా తన బిడ్డలను పిలుస్తున్నాడు. దేవుని వాగ్దానముల నెరవేర్పు కొరకు సహనముతో ఎదురుచూచుటలో కావాల్సిన విశ్వాసమును గూర్చి ఈ అధ్యాయము ఉద్ఘాటిస్తుంది; మరియు ఆయనకు సొంత కాలక్రమము ఉన్నదని, అది మన కాలక్రమమునకు పూర్తి భిన్నంగా ఉంటుందని ఇది మనకు గుర్తుచేస్తుంది.

*చూడటానికి సరైనదిగా కనబడే మార్గమును తీసుకొనుట.* నిజమైన విశ్వాసమనునది ఫలానా సమయమునకు సరైనదిగా అగుపడే ఆ మార్గమును విడిచి దేవుని మీద ఆధారపడి ఉండటం. దశాబ్దాలుగా అబ్రాహాము మరియు శారా దేవుడు తన వాగ్దానము నెరవేర్చులాగున ఎదురు చూచారు. దేవుడు వారిని మొట్టమొదటిసారిగా ఊరులో ఉండగా పిలిచిన నాటనుండి ఎన్ని సంవత్సరాలు గడిచినవో (11:31; 15:7; అపో. 7:2, 3) మరియు హారాను వారి దేశమని తెలియుటకు మునుపు వారు ఆ దేశములో ఎన్ని సంవత్సరములు గడిపారో (12:1–3; అపో. 7:4) మనము ఊహించగలము కూడా. ఇప్పటికి కనాను శములో వారు పది సంవత్సర ముల పాటు జీవించారు (16:3); అబ్రాహాము ఎనుబది యైదేండ్ల యీడుగలవాడు, మరియు శారా డెబ్బది యైదేండ్లు యీడుగలది (12:4; 17:17 చూడండి). అయినను, వారు బిడ్డలు లేకుండా ఉన్నారు. ఎలియాజరు వారసునిగా ఉండుటకుగల సాధ్యాపసాధ్యాలు హరించుకు పోయినవి, ఎందుకంటే దేవుడు చెప్పాడు వాగ్దాన వారసుడు—అంటే ఎవరివలనైతే

ఈ భూమి యొక్క కుటుంబములు అన్నియు ఆశీర్వదించబడతాయో వాడు–అబ్రాహాము యొక్క “గర్భవాసము” నుండి రావలసినవాడిగా ఉన్నాడు (15:4) అని.

వృద్ధురాలైన మరయు గొడ్రాలైన శారా ద్వారా దేవుని వాగ్దాన నెరవేర్పు ఎలా సాధ్యం? దీని జవాబును ఆమె, వారు తమ యాత్రలను ప్రారంభించిన ప్రాచీన మెసొపొతమియ స్మృతుల మరియు ఆచారములలో వెతికింది. అబ్రాహాము తన దాసియైన హాగరును తీసికొని ఆమె ద్వారా కుమారుని కనమని ప్రతిపాదించింది; అప్పుడు ఆ బిడ్డను తన సొంత బిడ్డగా శారా చెప్పుకొనవచ్చునని అనుకుంది. సుదీర్ఘకాలంగా గొడ్రాలుగా ఉన్న తన స్థితిని అధిగమించుటకు ఇది దోహదపడుతుందని ఆమె సుస్పష్టంగానే నమ్మింది–ఈ స్థితికి ఆమె “పిల్లలను కనకుండా” దేవుడు చేసెనని నింద దేవునిపై వేసింది (16:2). ఇదంతయు హేతువాదంగా మరియు ప్రయోగాత్మకంగా కనబడుతుంది, కాని ఇట్టి ఒక ప్రణాళిక నుండి రాగలిగే సమస్యలను శారాగాని అబ్రాహాముగాని ఊహించలేకుండా ఉన్నారు.

వేచి చూడడం అనునది సాధారణంగా మనము ఆనందించే విషయం కాదు, కాని ప్రజలు ఎప్పుడు విశ్వాసము కలిగి ఉండాలని దేవుడు పిలిచాడు. దేవుని వాగ్దానములు నెరవేరే విషయంలో నిజమైన విశ్వాసం ఓపికతో కనిపెట్టునట్లుగా మనలను చేస్తుంది.

దేవుడు ఇశ్రాయేలును వాగ్దాన దేశములోనికి నడిపించుటకుగాను మోషే, కాలేబు, మరియు యెహోషువాలు నలభై సంవత్సరములు అరణ్యములో వేచి ఉండవలసి వచ్చింది (సంఖ్యా. 13:17–14:45). ఇంత జరిగినా కూడా మోషే కేవలము ఆ దేశమును చూచుటకు మాత్రమే అనుమతించబడ్డాడు; దానిలో ఆయన ప్రవేశించలేకపోయాడు (ద్వితీయ. 32:48–52; 34:1–8).

యూదా మరియు యెరూషలేము మీదికి గొప్ప వినాశనమును సృష్టించిన దుర్మార్గపు బబులోనీయుల మీదకు రావాల్సిన శిక్షను రప్పించుటకు విశ్వాసముతో వేచి ఉండవలసినదిగా దేవుడు హబక్కూకుకు పిలుపునిచ్చాడు (హబక్కూకు 2:2–4). బబులోను యొక్క పతనము భవిష్యత్తులో దరిదాపుగా ఒక డెబ్బది సంవత్సరముల తరువాత జరగవలసి ఉండగా, దానిని చూచుటకు ఈ ప్రవక్త బహుశా జీవించి ఉండకపోవచ్చు (హబక్కూకు 3:16–19; యిర్మీయా 29:7–14).

దేవుడు ఆ సుదూర దేశములో వారిని మర్చిపోయాడేమో అనునట్లుగా అనిపించినప్పుడు బబులోనులో ఉన్న యూదులు నిరీక్షణను కోల్పోవద్దని యెషయా ప్రోత్సహించాడు. వారి చెరనుండి దేవుడు అనుగ్రహించే విమోచన కొరకు “వేచి చూచు” (నిరీక్షించు) లాగున చేసే నూతనీకరించబడిన విశ్వాసము కొరకు వారిని యెషయా పిలిచాడు (యెష. 40:1–31).

క్రొత్తనిబంధనలో పౌలు క్రైస్తవ జీవితమును మన శరీరముల "విమోచన" కొరకు మనము కనిపెట్టుకొనుచుండగా అనేక సమస్యల మధ్యనున్న మూలుగు వంటి అనుభవముతో పోల్చాడు (రోమా. 8:18–25). హెబ్రీ పత్రిక రచయిత అంటాడు "విశ్వాసము చేతను ఓర్పుచేతను వాగ్దానములను స్వతంత్రించుకొను(చున్నాము)" (హెబ్రీ. 6:12) అని.

దేవుడు అబ్రాహాము మరియు శారాలకు కుమారుని అనుగ్రహించుటకు అంత కాలం ఎందుకు ఆగాడు? ఆయన వారిని భౌతికంగా "మృతతుల్యులుగా" అవ్వాలని (హెబ్రీ. 11:12), అంటే తద్వారా ఆయన మాత్రమే మహిమ పొందాలని కోరాడు (రోమా. 4:20). వారు, మరియు వారి ద్వారా వచ్చే సంతానమంతయు, దేవునికి "అసాధ్యమైనది ఏమియు లేదు" (18:14) అని ఒప్పుకొనవలసిన అవసరముంది. దేవుని విధానము–విశ్వాస విధానము–ఒకవేళ అది దూరంగా మరియు కొన్నిసార్లు కష్టంగా అనిపించినప్పటికిని, మనము అనుసరించవలసిన విధానము.

*విశ్వాసమునకు మానవ ఆలోచనను ప్రతిక్షేపించడం.* తను బిడ్డలను కనగలిగే వయస్సు దాటిపోయిందని శారాకు తెలుసు, కాని తన భర్త మాత్రం బిడ్డలను కనుటకు ఇంకను సామర్ధ్యత కలవాడని ఆమె నమ్మింది. దేవుడు అబ్రాహామును ఏర్పరచబడిన వారసునికి తండ్రిగా గుర్తించాడని ఆమెకు తెలుసు (15:4), కానీ తల్లి యొక్క గుర్తింపును దేవుడు ఇంకను బయలుపరచలేదు. కాబట్టి సహజంగానే, చాలా సంవత్సరములు ఒక బిడ్డకు జన్మనిస్తానని ఆమె నమ్మింది; కాని ఇప్పుడు బిడ్డలను కనుటకు తగిన దశను ఆమె దాటిపోయింది గనుక ఆమె అబ్రాహామునకు ఒక వారసుని ఇచ్చుటకుగల హేతుబద్ధమైన విధానం తన దాసియైన హాగరును తన భర్తకు ఇచ్చి, వారి కలయిక ద్వారా పుట్టిన బిడ్డను తన సొంత బిడ్డగా పరిగణించడమేనని ఆలోచించింది.

విశ్వాసము మరియు మానవుని ఆలోచనలకు మధ్యగల సంఘర్షణ ఈ ఆధునిక కాలంలో వచ్చిన విషయమేమీ కాదు; అది మానవుని సహజ గుణము అంత పాతది. శారా ఇక్కడ "ద్వితీయ–ఆలోచన" కలిగిన దేవునిలా ఉంది. ఆమె ప్రణాళిక హేతుబద్ధమైనదిగా మాత్రమేగాక, దేవుడు తన వాగ్దానమును నెరవేర్చుటకు గల ఏకైక ఎంపిక ఇదేనేమోఅని శారా భావించేటట్లు ఉంది. ఒక విధంగా చూస్తే దేవునికి కష్టకాలంలో సహాయం చేయాలనుకుంటునట్లుగా ఆమె కనబడుతుంది. దేవుని కంటే ఎక్కువే ఆలోచించగలమని మానవులు అనుకోవడం ఎప్పుడు ప్రమాదకరమే. నిజమైన విశ్వాము దేవుని వాక్యము మీద ఆధారపడి ఉంటుంది (రోమా. 10:17), కాని శారా మాత్రం దేవునికంటే ముందుగానే పరుగెత్తి తనకు సరైనదిగా అనిపించే ఒక మార్గాన్ని ప్రతిపాదిస్తుంది (సామెతలు 14:12). ఒకవేళ "యెహోవా దూత" అరణ్యంలో జోక్యం చేసుకోకపోతే (16:7) ఆ వేడిమిలో హాగరు మరియు ఆ పసివాని మరణముల వలన ఆమె విధానం విషాదకరంగా ముగిసి ఉండేది.

ఈ సంఘటనలో శారా యొక్క ముఖ్య ఉద్దేశ్యం దేవుని మహిమపరచడం కాదు, కాని ఆమెకు బిడ్డలను ఇవ్వనందుకు ఆయనను నిందించడం (16:2). సాతాను తన చెవిలో "దేవునికి నీ అశక్తిని గూర్చి తన హృదయములో ఎట్టి ఆలోచన లేదు! ఆయన నిన్ను నిజంగానే ప్రేమించి ఉంటే, ఈ సమయమునకు నిన్ను అబ్రాహాము యొక్క కుమారునికి తల్లిని చేసేవాడు" (3:1–6 చూడండి) అని గుసగుసలాడియుంటుంది. దేవుని ప్రజలగా మనము ఊహించిన విధానంలో మరియు మనకు సరైన సమయముగా అనిపించే సమయమునకు దేవుడు మన ప్రార్థనలకు సమాధానం ఇవ్వకపోతే మనము కూడా ఇటువంటి ఒక ఉచ్చులో పడే ప్రమాదం ఉంది.

యేసు క్రీస్తు కూడా మెస్సియా అగుటకు ఇటువంటి ఒక అడ్డదారినే త్రొక్కమని సాతానుచే శోధించబడ్డాడు. శ్రమ అనుభవించుట కంటే తన శక్తిని వెల్లడిచేయడం చాలా సులువైన విషయం. నలభై దినములు ఉపవాసముండిన తరువాత కొన్ని రాళ్లను రొట్టెలుగా చేసుకొనుటలో ఏమి ప్రమాదముంటుంది? ఇదే విధంగా, తన కుమారుడు మెస్సియాగా అంగీకరించబడుటకు దేవుడు ఏర్పరచిన చిత్తాన్ని సాతానుడు భంగం చేయాలనుకున్నాడు. ఒకవేళ యేసు ఆ దేవాలయపు శిఖరము నుండి తన్నుతాను పడద్రోసుకొని యుండి దూతలచే కాపాడబడి యుంటే ఒకవేళ దీనిని ప్రజలు చూచియుంటే ఆయనను వారు వెంటనే మెస్సియాగా ప్రకటించియుండరా? అయి ఉండవచ్చు, కానీ శిలువ లేకుండా ఆయన యొక్క మెస్సియాతత్వము మన పాపముల కొరకు తన పరిహారార్థ మరణమును లేకుండా చేసేది (1 యోహాను 2:2). యేసు సాతాను విధానమును అది ఎంతటి హేతుబద్ధమైనదిగా కనబడినప్పటికి కూడా తిరస్కరించాడు, ఎందుకంటే మానవాళి మరెన్నటికిని పతన స్థితిలో ఉండి నిరీక్షణలేనివారి వలె ఉండడం ఆయనకు ఇష్టం లేదు (1 కొరింథీ. 15:1–4, 16–19).

*వివాదమునకు దారి.* విశ్వాసములో ఆత్మీయ మార్గభ్రంశం కొన్నిసార్లు కుటుంబ వివాదాలకు దారితీస్తుంది. దేవుని ప్రజలు ఈ లోకము యొక్క జ్ఞానమును అనుసరించినప్పుడు అది సాధారణంగా "అసూయ"కు, "స్వార్థపూరిత ఆశయాల"కు, మరియు "అక్రమము"నకు దారితీస్తుంది (యాకోబు 3:13–18). అబ్రాహాము కుటుంబములో జరిగినది క్లుప్తంగా ఇదే. కుటుంబ వివాదములు చాలా బాధాకరమైనవి మరియు వాటిని సర్దుచేయడం చాల కష్టం. శారా హాగరును అబ్రాహాముకు ఉపపత్ని – భార్యగా ఉండుటకు ఇచ్చినప్పుడు అట్టి నిర్ణయము కుటుంబ సమాధాన మునకు మరియు ఐక్యతకు ఎంతటి ప్రమాదాన్ని కలుగజేస్తుందో ఆమె గ్రహించలేదు.

పౌలు గలతీలో ఉన్న క్రైస్తవులకు వ్రాసినప్పుడు వారిని అడిగాడు, "మొదట ఆత్మానుసారముగా ఆరంభించి, యిప్పుడు శరీరానుసారులుగా పరిపూర్ణులగుదురా?" అని (గలతీ. 3:3). దేవుడు అబ్రాహాము మరియు

శారాలను ఇదే ప్రశ్న అడిగి ఉంటాడు. చాల సంవత్సరముల క్రితము వారు ఆయనతో ఆత్మీయ యాత్రను ప్రారంభించారు; కాని వారిప్పుడు శరీరము వైపు తిరిగి గొడ్రాలుగా ఉన్న తన భార్యకు సమాధానాన్ని ఇవ్వడానికి పక్కదారి పట్టారు. వారి సమస్యను పరిష్కరించుకొనుటకు బదులు దేవుని ప్రణాళికను సడలించడం ద్వారా సమస్య ఇంకా పెద్దదే అయింది. శారా యొక్క పధకమును వారు ఆచరించడం మొదలు, శరీర క్రియలు—అంటే "వివాదం," "అసూయ," మరియు "కోపోద్రేకం" (గలతీ. 5:19, 20) – అబ్రాహాము కుటుంబమునకు తీరని నిరాశను తెచ్చాయి.

బైబిల్ యొక్క కథనము ఇక్కడ హాగరు అబ్రాహాము ద్వారా వెంటనే బిడ్డను గర్భమున దాల్చిందని చెప్తున్నట్లుగా ఉంది (16:3, 4); ఇది స్పష్టమైన వెంటనే ఈ యౌవన దాసి బహుగా గర్వించి తన యజమానురాలి పట్ల ద్వేషంతో నిండుకున్నట్లుగా ఉంది (16:4). ఆమె అంతట ఆమె శారాకు సమానురాలిగా చూసింది లేదా తన యజమానురాలికి ఉన్న స్థితి కంటే తన స్థితి ఉన్నతమైనదన్నట్లుగా ప్రవర్తించింది (సామెతలు 30:23 చూడండి). శారా నొచ్చుకొని కోపగించుకుని తన దయనీయతను బట్టి తన భర్తను నిందించింది. అబ్రాహాము యొక్క నేరమును తన నేరము కంటే కూడా గొప్పదిగా తీర్పుతీర్చమని దేవుని బ్రతిమాలుకుంది (16:5). దీనితో పితరుడు హాగరును తిరిగి శారా అధికారం క్రింద పెట్టేశాడు; కాని శారా ఆమెను ఎంతగా బాధించింది అంటే ఈ ఐగుప్తీయురాలైన స్త్రీ అరణ్యములోనికి పారిపోవునంతగా తన జీవితమును బాధించింది (16:6).

ఈ కుటుంబమును కలవరపెట్టిన విచారకర సంఘటనలలో పాలిభాగస్తులు అందరు కూడా తప్పుచేసిన వారే, మరియు ఇదే కొన్ని సార్లు వివాహం, కుటుంబము ఆఖరుకు సంఘంలో కూడా జరిగే విషయం. సాధారణంగా అక్కడ ఎక్కువ శాతం నింద ఉంటుంది, ఇంకా ఆలోచిస్తేకోపము మరియు నేరారోపణలు సమస్యలను పరిష్కరించవు లేదా బీటలువారిన ఐక్యతను పునరుద్దరించవు.అట్టి పరిస్థితుల్లో సమాధానమును తిరిగి పొందడం అనునది పరస్పర పాప ఒప్పుకోలు, ఒకరినొకరు క్షమించుటకు సిద్ధపాటు, ఒకరినుండి ఒకరు మరియు దేవుని నుండి కూడా క్షమాపణను పొందుకొనుటలో చూపే శ్రద్ధఅనేవాటి మీద ఆధారపడి ఉంటుంది (మత్తయి 6:12–15; ఎఫెస్సీ. 4:29–32; కొలస్సీ. 3:12–15 చూడండి).

యోసేపు పట్ల యాకోబు చూపిన స్వాభిమానము ఈ కుటుంబ క్రియాశీలతను ఉదాహరిస్తుంది. యోసేపు తన తండ్రి యొక్క అభిమాన పుత్రుడు అనే వాస్తవం అతను మిగతా సహోదరులందరి కంటే తన్నుతాను హెచ్చించుకొనుటకు దోహదపడింది. ప్రతిగా వారు ఈయనను ద్వేషించి చంపడానికి చూచారు; దానికి బదులు బానిసగా ఐగుప్తు దేశమునకు అమ్మి తన తండ్రితో ఒక క్రూర జంతువు తనను చంపి తినేసిందని అబద్ధం చెప్పారు (37:1–36). చాలా సంవత్సరముల

తరువాత ఐగుప్తులో తన సహోదరుల మీద ప్రతికారము తీర్చుకొనుటకు యోసేపుకు అవకాశం వచ్చింది; కాని వారు చేసిన దానిని గూర్చి వారు నిజంగా పశ్చాత్తాపంతో నిండుకున్నారని ఆయన నమ్మినప్పుడు వారిని క్షమించి, వారంతయు మరలా ఒకే కుటుంబము అవులాగున తన తండ్రి కొరకు వారిని పంపాడు (45:1–28).

*విషాదమునకు దారి.* ప్రజలను భ్రష్టుపరచే ఆత్మీయ మార్గభ్రంశములు వారు దేవునివైపు తిరుగకపోతే విషాదకరంగా మారవచ్చు. సమస్యల నుండి పారిపోవడం నిజానికి ఎన్నడు దేనిని పరిష్కరించలేదు, కాని చాలామంది కష్టాలను ఎదుర్కొనుటకు బదులు వాటినుండి పారిపోవుటకు ప్రయత్నిస్తూ ఇదే పద్ధతిని అవలంబిస్తుంటారు. తన యజమానురాలి వలె హాగరుది కూడా ఈ వివాదంలో తప్పు ఉంది. శారా తనను బాధించి తన జీవితమును భరించలేనిదిగా చేసేంతగా ఆమె అహంకారమును చూపింది. ఆమె చేయవలసినదల్లా తన్నుతాను తగ్గించుకొని అబ్రాహాము స్థావరమునకు తిరిగి వచ్చి తన పాపమును ఒప్పుకొని తన యజమానురాలి నుండి క్షమాపణను కోరడమే. ఖుణ్ణంగా యెహోవా యొక్క దూత ఆమెను చేయమని చెప్పింది కూడాఇదే. ఒకవేళ హాగరు ఇంటికి తిరిగొచ్చి తన ప్రవర్తన యొక్క మార్పును చూపగలిగినట్లయితే, ఆమె ఎన్నడును ఆవిధంగా పరిగణించబడేది కాదు.

దేవుడు నిస్సందేహంగా ఆ తల్లి మరియు పుట్టని బిడ్డ యొక్క భౌతికపరమైన ఆరోగ్యమును కోరుకున్నాడు, కాని అబ్రాహాము యొక్క కుటుంబ సభ్యులను విడదీసిన ఆత్మీయ బీటలను కూడా ఆయన బాగుచేయాలనుకున్నాడు. హాగరుకు ఇవ్వబడిన దైవిక సందేశం ఎక్కువ బాధననుభవించిన గృహంలో ఆమెను బాగా చేర్చుకుంటారు అనే నిరీక్షణను ఇవ్వడం కొరకు మాత్రమే కాదు, కాని ఆమె ఒక కుమారునికి జన్మనిస్తుందని మరియు ఆయన అనేక జనములకు తండ్రి అవుతాడనే ఒక వాగ్దానమును కూడా ఆ సందేశం కలిగి ఉంది (16:10, 11). దేవుని కృప తనకు దేవుని చూచులాగున చేసిందని ఆశ్చర్యపడిపోయి ఇంకా బ్రతికే ఉంది, హాగరు “యెహోవా నామము పేరిట” ప్రార్థన చేసింది (16:13).

బైబిల్ చరిత్ర అంతటిలో కూడా, దేవుని ప్రజలు దేవుని నుండి వారిని దూరంగా చేసి తమ జీవితములను ప్రమాదభరితం చేసిన ఆత్మీయ మార్గభ్రంశం పొందారు. అటువంటి సమయాలలో ఆయన ఎప్పుడు వారిని పిలిచాడు – అయన హాగరును పిలిచినట్లుగానే – ఒక పేరు “మార్గము”న (דֶּרֶךְ, *derek*) వారిని తీసుకెళ్లడానికి మరియు తనవద్దకు తిరిగి వచ్చే మార్గమున వారిని నడిపించడానికి (16:7–9).

దేవుడు ఇశ్రాయేలును ఐగుప్తునుండి బయటకు రప్పించినపుడు, ఆయన రాత్రియందు అగ్నిస్థంబముతోను పగటి కాలమందు మేఘస్థంభముతోను వారిని నడిపి, ఎఱ్ఱ సముద్రమునకు మరియు ఎఱ్ఱ సముద్రముగుండా నడిపించే

“మార్గమున” [*derek*] వారిని నడిపించాడు (నిర్గమ. 13:17, 18; 14:19, 20 చూడండి).

దీని తరువాత ఇశ్రాయేలీయులు సీనాయి పర్వతము మీదికి నడిపించబడ్డారు, అక్కడ దేవుని ఆత్మీయ “మార్గమునకు” (*derek*; ద్వితీ. 5:33) నడిపించుటకు వారికి బోధించే పది ఆజ్ఞలను వారు పొందుకున్నారు. ఆయన మార్గము వారిని మరణమునకు బదులుగా జీవమునకు నడుపుతుంది (ద్వితీయ. 30:19, 20). అయినను, వారు దేవుడు “నియమించిన త్రోవనుండి త్వరగా తొలగిపోయి” విగ్రహారాధన వైపు తిరిగారు (నిర్గమ. 32:8). ఈ ఆత్మీయ మార్గభ్రంశంనకు తీవ్రమైన పరిణామాలు కలిగాయి: దేవునితో సహవాసమును కోల్పోవడం, తమ దేవాలయము మరియు దేశము నాశనం కావడం, మరియు వాగ్దాన దేశము నుండి చెరలోనికి కొనిపోబడటం. ఇట్టి పరిణామాలు జరుగుతాయని మోషే ప్రజలకు హెచ్చరించాడు (ద్వితీ. 29:24–30:1); అయినా కూడా దేవుడు వారిపై జాలిగొని ఒకవేళ వారు పశ్చాత్తాపపడి ఆయనవైపు తిరిగితే వారి చెరనుండి ఆయన విడిపించి తమ సొంత దేశమునకు తీసుకురాగలడనే సాధ్యమైన మార్గమును కూడా వారికి చూపాడు (ద్వితీ. 30:2, 3).

తరువాత వారి ఆత్మీయ మార్గభ్రంశం నుండి తిరిగి దేవుని వైపు మరియు ఒకప్పుడు ఇశ్రాయేలుకు సొంతమైన దేశమునకు తిరిగి రమ్మని ప్రవక్తలు ప్రజలను బ్రతిమాలారు. యెషయా ఈ పిలుపును ఈ క్రింది మాటల ద్వారా తెలిపాడు:

> అక్కడ దారిగా [*derek*] నున్న రాజమార్గము ఏర్పడును
> అది పరిశుద్ధ మార్గమనబడును [*derek*]
> అది అపవిత్రులు పోకూడని మార్గము
> అది మార్గమున పోవువారికి ఏర్పరచబడును
> మూఢులైనను దానిలో నడచుచు త్రోవను [*derek*] తప్పక యుందురు …
> విమోచింపబడినవారే అక్కడ నడచుదురు
> యెహోవా విమోచించినవారు పాటలుపాడుచు తిరిగి సీయోనుకు వచ్చెదరు …
> (యెష. 35:8–10; 40:3–5; 43:19; 55:7–9 చూడండి).

*ముగింపు: దేవుని వైపు వెనుకకు తిరిగే మార్గము.* క్రొత్త నిబంధనలో, “యేసుక్రీస్తు సువార్త” (మార్కు 1:1) తమ ఆత్మీయ మార్గభ్రంశము నుండి ప్రజలు వెనుకకు తిరుగులాగున ప్రకటించుటకు దేవునిచే ఆజ్ఞాపించబడిన బాప్తిస్మమిచ్చు యోహాను ప్రకటనతో ప్రారంభమౌతుంది. యోహాను యొక్క పని “ప్రభువు మార్గము [ὁδός, *hodos*] సిద్ధపరచుటకును, ఆయన త్రోవలను సరాళము చేయుటకును” (మార్కు 1:3) ఆయన పిలువబడ్డాడు. ఆయన దీనిని “పాప క్షమాపణ నిమిత్తము మారుమనస్సు విషయమైన బాప్తిస్మము” యొక్క ప్రకటన ద్వారా చేశాడు (మార్కు 1:4) మరియు “లోకపాపమును మోసికొనిపోవు దేవుని

గొర్రెపిల్ల" అయిన యేసు వైపు ప్రజలను తిప్పుతూ ప్రకటించాడు (యోహాను 1:29).

తరువాత శిలువ నీడలో తన నిష్క్రమణను గూర్చి యేసు శిష్యులతో మాట్లాడాడు. ఆయన ఎందుకు విడనాడుతున్నాడో మరియు వారు ఆయనను ఇకెన్నడునూ ఎందుకు అనుసరించలేరో (యోహాను 13:36, 37) తెలియక వారు కలవరపడిపోయారు. యోహాను సువార్త 14లో ప్రభువు శిష్యులకు "స్థలము సిద్ధపరచ" తన "తండ్రి ఇంటికి" వెళ్తున్నానని బయలుపరచాడు, మరియు వారిని తరువాత అక్కడికి తీసుకెళ్లుటకు ఆయన మరలా వస్తానని చెప్పాడు (యోహాను 14:2, 3). "నేను వెళ్లుచున్న స్థలమునకు మార్గము [*hodos*] మీకు తెలియును" అని చెప్తూ (యోహాను 14:4) వారిని ఆశ్చర్యపరచాడు. అందుకు తోమా "ప్రభువా, యెక్కడికి వెళ్లుచున్నావో మాకు తెలియదే; ఆ మార్గామేలాగు [*hodos*] తెలియునని"అడిగాడు. ఆయనకు యేసు జవాబు, "నేనే మార్గమును [*hodos*], సత్యమును జీవమును; నా ద్వారానే తప్ప యెవడును తండ్రియొద్దకు రాడు" (యోహాను 14:5, 6). ఎంతో మంది వేరొక మార్గమును తీసుకొనుటకు శోధింపబడియుండగా దేవుని యొద్దకు, పరలోకమునకు మరియు నిత్య జీవమునకు యేసు మాత్రమే ఏకైక నిజమైన మార్గము, దారి, త్రోవ [*hodos*] అయి ఉన్నాడు. ఆదిమ క్రైస్తవులు "మార్గము [*hodos*]"నకు చెందిన ప్రజలగా గుర్తింపబడ్డారు (అపొ. 9:2; 22:4; 24:14). తండ్రి ఇంటికి యేసు ఒక్కడే నిజమైన మరియు ఏకైక మార్గమై యున్నాడు (లూకా 15:11–32 చూడండి).

---

## సూచనలు

[1]ఆదికాండము 16:3లో ఇవ్వబడిన సమాచారము ప్రకారముగా, ఈ సమయమునకు అబ్రాహాము ఎనుబది యైదేండ్లు మరియు శారా డెబ్బది యైదేండ్లు యీడుగల వారు. (హారానును వదలినప్పుడు అబ్రాహాము వయసు కొరకు 12:4 చూడండి మరియు వీరిద్దరి మధ్యగల వయసు వ్యత్యాసం కొరకు 17:17 చూడండి). [2]Hermann J. Austel, "שִׁפְחָה," in *TWOT*, 2:947. [3]Theophile J. Meek, trans., "Real Adoption," in *Ancient Near Eastern Texts: Relating to the Old Testament*, 3d ed., ed. James B. Pritchard (Princeton, N.J.:Princeton University Press, 1969), 220. ఈ ప్రయోగమును గూర్చిన ఇతర వచనముల కొరకు చూడండి, Victor P. Hamilton, *The Book of Genesis: Chapters 1–17*, The New International Commentary on the Old Testament (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1990), 444. [4]ఆదాము హవ్వ యొక్క "మాట విన్నాడు" అని ఆదికాండము 3:17 చెప్తుంది. [5]Hamilton, 446. [6]వారి పాపమును ఒప్పుకొనుటకు బదులుగా ఆదాము మరియు హవ్వలు ఇద్దరు నిందను నెట్టుకోవడానికి ఆదికాండము 3:12, 13లో ఇటువంటి ఒక ప్రయత్నమునే చేశారు. [7]*The Code of Hammurabi* 146. [8]Leonard J. Coppes, "עָנָה," in *TWOT*, 2:682. [9]16:7, 9–11, 13; 22:11, 12, 15; 31:11, 13; 32:24, 28, 30;

నిర్గమ. 3:2, 4; న్యాయాధి. 6:12, 14, 22; 13:6, 9, 22 చూడండి. [10]Francis Brown, S. R. Driver, and Charles A. Briggs, *A Hebrew and English Lexicon of the Old Testament* (Oxford: Clarendon Press, 1962), 825.

[11]ఇది అనువాదములో ఉన్న అస్థిరత్వం. 16:12లో ఇష్మాయేలు మరియు తన బంధువులను గూర్చి ఉన్న ప్రవచనము మరియు 25:18లో ఉన్న దాని నెరవేర్పు ఇదే విధంగా అనువదించబడాలి. [12]RSV మరియు NRSV అనువాదములలో కూడా ఇదే విధమైన అనువాదం చేయబడింది. [13]Kenneth A. Mathews, *Genesis 11:27–50:26*, The New American Commentary, vol. 1B (Nashville: Broadman & Holman Publishers, 2005), 192. [14]దాసిలకు పుట్టిన బిడ్డలు తమ తండ్రి యొక్క స్వాస్థ్యములో ఏమైనా వారసత్వం పొందుకోవాలనుకుంటే ముందు వారు తమ తండ్రి చేత అంగీకరించబడాలి. (*The Code of Hammurabi* 171.)